ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

బుధవారం 7 మే 2025



కలైవానర్ అరంగంలో పత్రికాధిపతులు, పాత్రికేయుల సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఎన్నికల హామీలను నెరవేర్చాం

మా మంచి పథకాలను ప్రశంసించండి

మీడియా ప్రతినిధుల భేటీలో సీఎం స్టాలిన్

మా ఓటమి కోసం తపిస్తున్న ప్రతిపక్షాలు

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ద్రావిడ తరహా పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదో యేటా సగర్వంగా అడుగుపెడుతోందని, ఎన్నికల సమయంలో ప్రకటించిన ఎన్నో హామీలనే కాకుండా చెప్పని పథకాలను కూడా అమలు చేసి ప్రజల ఆదరాభిమానాలను మెండుగా పొందామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. స్థానిక చేపాక్ కలైవానర్ అరంగంలో మంగళవారం ఉదయం ఏర్పాటైన పత్రికాధిపతులు, సంపాదకులు, సీనియర్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటైంది. ఈ సమావేశంలో సమాచార శాఖ మంత్రి సామినాథన్ స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ.. 2021 ఆరోసారి డీఎంకే అధికారంలోకి వచ్చిందని, ఆ యేడాది మే 7న సీఎంగా బాధ్యతలు స్వీకరించానని, బుధవారం తమ ప్రభుత్వం ఐదో యేట అడుగుపెట్టనుందని చెప్పారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి పథకాలపై పత్రికలు ప్రశంసించాలని, అదే సమయంలో తమ పాలనలో తప్పిదాలుంటే విమర్శించాలని, తానెప్పుడూ కూడా సద్విమర్శలకే ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఆ విమర్శలకు అనుగుణంగా పాలనలో మార్పులు తెచ్చేందుకు కూడా వెనుకాడనని చెప్పారు.

పథకాల బాట...

కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం, సిటీ, టౌన్ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే మహిళల వెలుగుబాట పయనం పథకం, బడి పిల్లలకు సీఎం అల్పాహార పథకం, విద్యార్థినులకు పుదుమై పెణ్, విద్యార్థులకు నాన్ ముదల్వన్ పథకం అమలు చేస్తున్నామని, తమ ప్రభుత్వం విద్యా, వైద్యరంగాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. వీటితోపాటు రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధిపరిచేందుకు ఎన్నో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేశానని స్టాలిన్ వివరించారు.

పాలన ఆదర్శం...

దేశానికే ఆదర్శవంతమైన పలు పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, తమ పథకాలను చూసి మెచ్చుకుని ఇతర రాష్ట్రాలకు కూడా ఇలాంటి పథకాలనే మార్పులు చేర్పులు కల్పించి అమలు చేస్తున్నాయని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షాలన్నీ ద్రావిడ తరహా పాలనలో అమలు చేస్తున్న పథకాలకు ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతుండటంతో ఓర్వలేక అదేపనిగా పసలేని విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నాయని, అంతే కాకుండా ఈ ప్రభుత్వం ఎప్పుడు పతనమవుతుందా అని ఎదురు చూస్తున్నారని, వారి ఆశలు నెరవేరే ప్రసక్తే లేదని ఏడోసారి కూడా డీఎంకే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఐదో యేట అడుగు పెడుతున్న తమ ప్రభుత్వంపై ఎప్పటిలాగే సద్విమర్శలు చేయాలని, మంచి పథకాలను మెచ్చుకోకపోయినా పరవాలేదు, తిట్టిపోయకుండా ఉంటే మంచిదని అన్నారు. గత నాలుగేళ్లుగా సీనియర్ పాత్రికేయులతో, పత్రికల సంపాదకులతో తాను సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నానని, భవిష్యత్తులోనూ అలాగే ఉంటానని చెప్పారు.

ఎన్నికల పనులు ప్రారంభించండి...

వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లోనూ డీఎంకే ఘనవిజయం సాధిస్తుందని, పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుంచే ఎన్నికల పనులను ప్రారంభించాలని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు మంగళవారం లేఖ రాశారు. రాష్ట్ర హక్కులను హరిస్తూ, కులపరంగా, మతపరంగా చిచ్చురేపేందుకు ప్రయత్నించే మతతత్వ పార్టీ బీజేపీతో ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే అత్యవసరంగా పొత్తుపెట్టుకుని ఘోర తప్పిదానికి పాల్పడిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీల అపవిత్రకూటమి చిత్తుగా ఓడిపోవటం ఖాయమని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 200పైగా సీట్లలో గెలుస్తామని, ఈ విషయంలో పార్టీ శ్రేణులకు ఏ మాత్రం సందేహం అక్కర్లేదని, అయితే అంతటి గెలుపును సాధించాలంటే కార్యకర్తలంతా ఇప్పటి నుంచే ఎన్నికల పనులు ప్రారంభించాలని కోరారు. డీఎంకే ప్రభుత్వం అమలు చేసిన పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని స్టాలిన్ కోరారు.

● భూకబ్జా కేసు

23న గైర్హాజరైతే ఛార్జిషీట్ నమోదు

● మంత్రి సుబ్రమణ్యానికి ప్రత్యేక కోర్టు తాఖీదు



చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం నగర మేయర్‌గా ఉన్నప్పుడు జరిగిన భూకబ్జా కేసులో ఈ నెల 23న విచారణకు హాజరుకాకపోతే ఛార్జిషీటు నమోదు చేస్తామని ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ ఆయనకు తాఖీదు జారీ చేశారు. స్థానిక గిండిలోని లేబర్ కాలనీలో ఎస్‌కే కన్నన్‌కి కేటాయించిన సిడ్కో సంస్థ స్థలాన్ని సుబ్రమణ్యం నగర మేయర్ హోదాలో తన అధికారాన్ని ఉపయోగించి ఆ స్థలాన్ని తన భార్య కాంచన పేరున రాయించారని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై పార్తిబన్ అనే వ్యక్తి 2011లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రి సుబ్రమణ్యం, ఆయన భార్య కాంచన తదితరులపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించిన ఛార్జిషీటును 2019లో అవినీతి నిరోధక శాఖ పోలీసులు దాఖలు చేశారు. ఆ కేసు విచారణ చెన్నై కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను విచారణ జరిపే ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉండేది. ఆ కేసును రద్దు చేయాలని కోరుతూ మంత్రి సుబ్రమణ్యం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆ పిటిషన్ తోసిపుచ్చింది. అంతటితో ఆగకుండా మంత్రిపై దాఖలైన కేసును త్వరగా విచారణ జరపాలంటూ ప్రత్యేక కోర్టుకు ఆదేశాలిచ్చింది. ఇటీవల ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేయడం కోసం విచారణకు రమ్మంటూ మంత్రి సుబ్రమణ్యంకు ప్రత్యేక కోర్టు ఆదేశాలిచ్చింది. ఆ సమయంలో శాసనసభ సమావేశాలు జరుగుతుండటంతో విచారణకు హాజరుకాలేనని ఆయన చెప్పారు. ఈ పరిస్థితులలో ఆ కేసు విచారణ మంగళవారం జరిగినప్పుడు కూడా మంత్రి సుబ్రమణ్యం, ఆయన భార్య కాంచన హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణకు ఆ ఇరువురూ తప్పకుండా హాజరుకావాలని, లేకుంటే అదే రోజున ఏకపక్షంగా ఛార్జిషీటు నమోదవుతుందని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి హెచ్చరించారు. తదుపరి విచారణను ఈ నెల 23న వాయిదా వేశారు.

● జీసీసీ కమిషనర్ ఉత్తర్వులు

లైంగిక వేధింపుల నిరోధం కోసం 15 జోన్లలో ఫిర్యాదు కమిటీలు



ప్యారీస్, మే 6 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగినులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల నిరోధం కోసం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో పాల్గొనే మహిళలకు భద్రత కల్పించేలా నగరంలోని 15 జోన్లలో ప్రత్యేక ఏర్పాట్లు కల్పించడంతో పాటు, ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాల్సిందిగా జీసీసీ కమిషనర్ కుమరగురుబరన్ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక అంబత్తూరు జోన్ పరిధిలోని 84వ వార్డులో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులు తమను సూపర్‌వైజర్ లైంగికంగా వేధిస్తున్నారంటూ జీసీసీ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయితే విచారణకు ప్రత్యక్షంగా హాజరై తాము ఎదుర్కొన్న సమస్యల గురించి విచారణ అధికారులకు తెలియజేసేందుకు ఆ మహిళలు ముందుకు రావడంలేదు. వాస్తవం చెబితే తమను ఉద్యోగం నుంచి తీసేస్తారనే భయంతో వారు వెనక్కి తగ్గుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని జోన్లలో మహిళా ఉద్యోగులకు వ్యతిరేకంగా జరిగే లైంగిక వేధింపులపై విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో అధికారులు, కౌన్సిలర్లు, జోనల్ ఛైర్మన్ల పేర్లు, వారి సెల్‌ఫోన్లు, వార్డుల వివరాలను ప్రకటన బోర్డులో పొందుపరచాల్సిందిగా పేర్కొన్నారు. ముందుగా జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఫిర్యాదు కమిటీల ఏర్పాటులో పాల్గొనాలని, ప్రతినెలా స్వీకరించిన ఫిర్యాదులపై చేపట్టిన చర్యలకు సంబంధించిన నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా అంబత్తూరు ప్రాంతంలో లైంగిక వేధింపులకు గురైన మహిళా పారిశుధ్య కార్మికుల ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు.





మదురై జిల్లా క్రీడా మైదానంలో రూ.8.25 కోట్లతో పునరుద్ధరించిన కృత్రిమ టర్ఫ్ రన్నింగ్ ట్రాక్, సహజ గడ్డి ఫుట్‌బాల్ మైదానాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ఉదయనిధి, మేఘనాథ రెడ్డి తదితరులు

ఉగ్రవాదులను దండిస్తే చాలు.. యుద్ధం వద్దు

● ఎండీఎంకే వార్షికోత్సవంలో వైగో

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో పర్యాటకులపై దాడులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా దండిస్తే చాలని, పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సిన అవసరం లేదని ఎండీఎంకే అధినేత వైగో పేర్కొన్నారు. ఎగ్మూరులోని పార్టీ కార్యాలయం తాయగంలో మంగళవారం ఉదయం పార్టీ 32వ వార్షికోత్సవాల్లో ఆయన పాల్గొని పార్టీ శ్రేణులకు మిఠాయిలు, లడ్డూలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... యుద్ధం వస్తే ఇరువైపులా ప్రాణనష్టం జరుగుతుందని, చిన్నారులు అనారోగ్యానికి గురవుతారన్నారు. డీఎంకే, అన్నాడీఎంకే తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పార్టీశ్రేణులు అధికంగా ఉన్న పార్టీ ఎండీఎంకే మాత్రమేనని చెప్పారు. తాను రాజ్యసభ సీటుకోసం డీఎంకేపై ఎలాంటి ఒత్తిడి చేయడం లేదని పేర్కొన్నారు.

బాత్రూంలో జారిపడ్డ వైగో...

స్థానిక అన్నానగర్‌లో తన స్వగృహంలో మంగళవారం వేకువజాము 5 గంటలకు బాత్‌రూంలో వైగో కాలుజారి పడ్డారు. ఈ సందర్భంగా చేతివేళ్లకు గాయాలయ్యాయి. ఆయన్ను గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వైద్యనిపుణులు చేతివేళ్లకు కట్టుకట్టి డిశ్చార్జి చేశారు. వైగో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన విషయం తెలియక పార్టీ శ్రేణులు అపోలో ఆస్పత్రి వద్ద పెద్ద సంఖ్యలో గుమికూడారు. వైగో చికిత్సలందుకుని ఇంటికి వెళ్లారని తెలియడంతో కార్యకర్తలంతా అక్కడి నుంచి బయలుదేరి అన్నానగర్‌లోని వైగో నివాసం వద్దకు వెళ్లి పరామర్శించారు.



పార్టీ వార్షికోత్సవంలో నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంచుతున్న వైగో

రూ.17 కోట్లతో ఆధునిక క్రీడా సౌకర్యాలు

ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తంజావూరు, మదురై, తిరునల్వేలి జిల్లాల్లోని క్రీడా మైదానాల్లో రూ.16.73 కోట్లతో ఏర్పాటు చేసిన ఆధునిక క్రీడా సౌకర్యాలు, రూ.3.68 కోట్లతో స్టార్ అకాడమీలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించారు. స్థానిక నెహ్రూ స్టేడియంలో చెన్నై ఒలంపిక్ అకాడమీ సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉదయనిధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తంజావూరు జిల్లా క్రీడా మైదానంలో రూ.7 కోట్లతో పునరుద్ధరించిన కృత్రిమ టర్ఫ్ రన్నింగ్ ట్రాక్, సహజ గడ్డి ఫుట్‌బాల్ మైదానం, మదురై జిల్లా క్రీడా సముదాయంలో రూ.8.25 కోట్లతో పునరుద్ధరించిన కృత్రిమ టర్ఫ్ రన్నింగ్ ట్రాక్, ఫుట్ బాల్ మైదానం, తిరునల్వేలి జిల్లా క్రీడా మైదానంలో రూ.1.48 కోట్లతో పునరుద్ధరించిన కృత్రిమ టర్ఫ్ వాలీబాల్ మైదానం తదితరాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉదయనిధి ప్రారంభించారు. అనంతరం, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభావంతులైన క్రీడాకారిణులు, క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అన్ని జిల్లా క్రీడా కార్యాలయాల్లో రూ.3.68 కోట్లతో తమిళనాడు క్రీడాభివృద్ధి అథారిటీ స్టార్ అకాడమీ, కన్నియాకుమారి జిల్లాలో రూ.11.83 లక్షలతో ఏర్పాటుచేసిన ఆత్మరక్షణ క్రీడలు, పరిశోధన కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. కాంచీపురం జిల్లా ఉత్తిరమేరూర్, చెంగల్పట్టు జిల్లా తాంబరం, తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం, 18 శాసనసభ నియోజకవర్గాల్లో తలా రూ.3 కోట్లతో 'ముఖ్యమంత్రి చిన్న క్రీడా స్టేడియం'ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే, 39 మందికి 'ముఖ్యమంత్రి రాష్ట్ర క్రీడా అవార్డు'లను అందజేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతుల్ మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి సహా పలువురు పాల్గొన్నారు.



ధ్వంసమైన ప్రభుత్వ బస్సు

పుదుకోట సమీపంలో ఇరువర్గాల ఘర్షణ

● బస్సు, పోలీసు జీప్ ధ్వంసం
● 14 మంది అరెస్ట్
● మద్యం దుకాణాల మూసివేత

ప్యారీస్, మే 6 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా అలంగుడి సమీపంలోని వడకాడు గ్రామంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం ఘర్షణలకు దారితీసింది. గుడిసెకు, ద్విచక్ర వాహనాలకు నిప్పంటించిన ఆందోళనకారులు బస్సు, పోలీస్ జీప్‌ను ధ్వంసం చేశారు. ఈ చర్యలకు పాల్పడిన 14 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఘర్షణల కారణంగా జిల్లా యంత్రాంగం ఆ ప్రాంతంలో పోలీస్ భద్రతను కట్టుదిట్టం చేయడంతో మూడు టాస్మాక్ మద్యం దుకాణాలను మూసి వేసింది. వడకాడు ముత్తుమారియమ్మన్ ఆలయంలో సోమవారం రాత్రి 8 గంటలకు నిర్వహించిన రథోత్సవంలో చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఆలయ ప్రవేశద్వారం వద్ద కొంతమంది యువకుల మధ్య వాగ్వాదం చివరకు ఘర్షణలకు దారితీసింది. ఇరువర్గాలకు చెందిన యువకులు కత్తులతో పరస్పరం దాడికి పాల్పడటంతో 10 మందికి పైగా గాయాలయ్యాయి. అడ్డుకునేందుకు వెళ్లిన కానిస్టేబుల్ సత్యకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో ఆయనను అలంగుడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లౌడ్ స్పీకర్ల ద్వారా పోలీసులు ఎంత వారించినా.. వినిపించుకోని ఆందోళనకారులు ఆ గ్రామంలో ఉన్న ఓ పూరి గుడిసెకు, ద్విచక్రవాహనాలకు నిప్పంటించారు. మరికొంత మంది పోలీసు వాహనం, ప్రభుత్వ బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘర్షణకు సంబంధించి 14 మందిని అరెస్టు చేశారు. పుదుకోట - పట్టుకోట - పేరావూరిణి మధ్య మంగళవారం బస్సులను నడపలేదు.



సమాచార దృష్టి

ఒక రోజు ముందుగానే ప్లస్‌టూ పరీక్షా ఫలితాలు

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షా ఫలితాలు ఈనెల 8వ తేది వెలువరించనున్నారు. ఈ ఫలితాలు ఈనెల 9వ తేది విడుదల చేస్తామని ఇదివరకే షెడ్యూల్‌లో ప్రకటించగా, ఒక రోజు ముందుగానే విడుదల కానున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంలో ప్లస్‌టూ, ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు గత మార్చి 3న ప్రారంభమై 25వ తేది వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,316 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా, 8.21 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

అందుబాటులోకి మూడు వెబ్‌సైట్లు

● విద్యుత్ బోర్డు

పెరంబూర్,మే6(ఆంధ్రజ్యోతి):తమిళనాడు విద్యుత్ బోర్డు అనుబంధ సంస్థ తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ సౌర,పవనవిద్యుత్ సహా గ్రీన్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తోంది.ఈసంస్థ www. tngecl.org అనే వెబ్‌సైట్ పరిచయం చేసింది.ఈ వెబ్‌సైట్ ద్వారా గ్రీన్ విద్యుత్ గురించి సమాచారం తెలుసుకోవడంతో పాటు పైకప్పు సౌర విద్యుత్ ప్లాంట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, విద్యుత్ బోర్డు, కాంట్రాక్టు కంపెనీల మధ్య కమ్యూనికేషన్ క్రమబద్ధీకరించేలా vendor.tnebltd.org/appvendor/ అనే వెబ్‌సైట్, ఉద్యోగుల మానవ వనరుల అవసరాలు నిర్వహించేలా మరో వెబ్‌సైట్ ప్రారంభించింది.

నాలుగు వార్డుల ఉపఎన్నికల్లో 1.02 లక్షల ఓటర్లు

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో ఖాళీగా ఉన్న నాలుగు కౌన్సిలర్ పదవులకు నిర్వహించనున్న ఉపఎన్నికల్లో 1.02 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జీసీసీ ఎన్నికలు గత 2022లో జరిగాయి. ఈ ఎన్నికల్లో 59, 122, 146, 165 వార్డుల నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు వివిధ కారణాలతో మృతిచెందారు. ఖాళీగా ఉన్న ఈ వార్డులకు ఈ నెలాఖరులో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో, నాలుగు వార్డుల ఉప ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను జీసీసీ అదనపు కమిషనర్ జయచంద్ర భానురెడ్డి, డిప్యూటీ కమిషనర్ పృథ్వీరాజ్ సోమవారం రిప్పన్ భవనంలో విడుదల చేశారు. మొత్తం 98 పోలింగ్ కేంద్రాల్లో 50,983 మంది పురుషులు, 51,145 మంది మహిళలు, 32 మంది హిజ్రాలు కలిపి 1,02,160 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు 2027వ సంవత్సరం వరకు పదవుల్లో కొనసాగుతారని అధికారులు తెలిపారు.

చెన్నై - గూడూరు మధ్య మరో రెండు రైల్వే లైన్లు

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మధ్య మరో మరో రెండు రైల్వే లైన్లు ఏర్పాటుకు అనుమతించాలని దక్షిణ రైల్వే సిఫారసు చేసింది. ఈ విషయమై రైల్వే అధికారులు మాట్లాడుతూ... చెన్నై - గుమ్మిడిపూండి - గూడూరు మధ్య రెండు రైలు మార్గాలు ఉన్నాయన్నారు. చెన్నై సెంట్రల్ - అత్తిపట్టు వరకు 22 కిలోమీటర్ల దూరం నాలుగు రైలు మార్గాలు ఉన్నాయన్నారు. ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్లు ఆలస్యం లేకుండా నడిపేందుకు ఈ మార్గాలు సరిపోవడం లేదన్నారు. అందువల్ల చెన్నై - గూడూరు మధ్య 3, 4వ లైన్ల ఏర్పాటుకు అనుమతించాలని రైల్వే బోర్డుకు సిఫారసు చేశామని తెలిపారు. అదనపు రైలు మార్గాలు నిర్మిస్తే, ఢిల్లీ, ఆగ్రా, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఆలస్యం లేకుండా ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్లు నడిపే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

వాటర్ క్యాన్లలను 30 సార్లు మాత్రమే వినియోగించాలి

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): వాటర్ క్యాన్లను తాగునీటితో రీ ఫిల్లింగ్ చేసి 30 సార్లు మాత్రమే నింపాలని ఆహార భద్రత శాఖ సూచించింది. రంగుల మారిన క్యాన్‌ను పదే పదే తాగునీటితో నింపడం మానుకోవాలి తెలిపింది. సరైన అనుమతులు లేకుండా, నాసిరకం తాగు నీరు సరఫరా చేసే సంస్థలపై కఠిన చర్యలు చేపడతామని ఆహార భద్రతా శాఖ హెచ్చరించింది.

11 నుంచి భాగవత మేళా

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): భాగవత మేళా నాటక సంఘం ఆధ్వర్యంలో మేలటూరులో ఈనెల 11వ తేది 'భాగవత మేళా' ప్రారంభం కానుంది. లక్ష్మీ నరసింహ జయంతి సందర్భంగా తంజావూరు జిల్లా మేలటూరులో యేటా భాగవత మేళా నాట్య నాటకం (తెలుగులో) నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది 11వ తేది రాత్రి మేలటూరు వరదరాజ పెరుమాళ్ ఆలయంలో భాగవత మేళా ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవానికి భరత నాట్య కళాకారిణి పద్మా సుబ్రమణ్యం, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ డైరెక్టర్ అనిష్ పి.రాజన్ తదితరులు హాజరుకానున్నారు. రాత్రి 9.30 గంటలకు 'ప్రహ్లాద చరిత్ర' ప్రదర్శించనున్నారు. 12వ తేది రాత్రి 8 గంటలకు భరత నాట్యం, 9 గంటలకు తమిళంలో పరిష్వంగ పట్టాభిషేకం, 13న రాత్రి 9 గంటలకు భాగవత మేళా నాటకం-హరిశ్చంద్ర నాట్య నాటకం పార్ట్-1. 14న రాత్రి 9 గంటలకు హరిశ్చంద్ర నాటకం పార్ట్-2, 15న రాత్రి 8 గంటలకు భరత నాట్యం, 16న రాత్రి 9 గంటలకు ఉషా పరిణయం, 17న రాత్రి 9 గంటలకు మార్కండేయ చరిత్రం, 18న రాత్రి 9 గంటలకు 'తిరుమణం' తమిళ నాటకం, 19న సాయంత్రం ఆంజనేయ ఆరాధన తదితరాలు ప్రదర్శించనున్నట్లు సంఘ నిర్వాహక ట్రస్టీ ఎస్.కుమార్ తెలిపారు.

'స్టార్టప్' ఆర్థిక సాయానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలిసారిగా, తయారీ ఆధారిత స్టార్టప్‌లను ప్రోత్సహించేలా తమిళనాడు స్టార్టప్ ఇనిస్టిట్యూట్ ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడుల సమీకరణ, వినూత్న వ్యాపార వాతారణం సృష్టించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిధులు అందించడం ద్వారా స్టార్టప్ సంస్థలను ప్రోత్సహిస్తోంది. ఈ విషయమై తమిళనాడు స్టార్టప్ ఆర్గనైజేషన్ సలహాదారులు జలపతి మాట్లాడుతూ... తయారీ రంగంలో వ్యవస్థాపక ప్రణాళిక ఉన్న వారికి ఈ పథకంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంపిక చేసిన స్టార్టప్ సంస్థలు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఆర్థిక సాయం పొందవచ్చు. ఆసక్తి కలిగిన సంస్థలు form.startuptn.in/FAM లో ఈ నెల 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు నెం.9842896673లో సంప్రదించవచ్చని జలపతి తెలిపారు.

కొడనాడు హత్య కేసులో సీబీసీఐడీ విచారణకు 'జయ' సహాయకుడు

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మాజీ సీఎం జయలలిత వేసవి విడిది కేంద్రం కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన వాచ్‌మన్ హత్య, దోపిడీ, హత్యాయత్నం, సీసీ కెమెరాల కంట్రోల్ యూనిట్ ఇన్‌ఛార్జి ఆత్మ హత్య సంఘటనలపై జరుగుతున్న సీబీసీఐడీ విచారణకు ఆమె వ్యక్తిగత సహాయకుడు కనియన్ పూంగుండ్రన్ మంగళవారం ఉదయం హాజరయ్యారు. అంతకు ముందు మార్చిలో జయ దత్తతపుత్రుడు సుధాకరన్, ఆమె మాజీ భద్రతాదళం అధికారులు, నిందితుడు సయాన్ సహా పలువురిని సీబీసీఐడీ పోలీసులు విచారించింది. కొడనాడు ఎస్టేట్‌లో జయ భద్రపరచిన కోట్లాది రూపాయల విలువైన బంగారు , వెండి ఆభరణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో ఇప్పటిదాకా 250 మందికిపై సాక్షులను విచారించారు. ఇక న్యాయస్థానం ఆదేశాల ప్రకారం ప్రధాన నిందితుడు కనకరాజ్‌తో సంబంధం కలిగిన అంతర్జాతీయ ఫోన్ నెంబర్ల వివరాలను ఇంటర్‌పోల్ ద్వారా పొందటానికి సీబీసీఐడీ పోలీసులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. 2017 ఏప్రిల్ 23న కొడనాడు ఎస్టేట్ వద్ద వాచ్‌మన్ ఓం బహదూర్‌ను గుర్తు తెలియని దుండగులు హత్య చేసి, మరో వాచ్‌మన్ కృష్ణబహదూర్‌పై హత్యాయత్నానికి పాల్పడి ఆ ఎస్టేట్ బంగళాలో దాచి ఉంచిన విలువైన నగలు, నగదును దోచుకెళ్లారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 10 మందిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు కనకరాజ్ కారు ప్రమాదంలో అనుమానాస్పదరీతిలో మృతి చెందాడు నేరస్థుల ఫోన్ సంభాషణలు, ఎలక్ట్రానిక్ వస్తువులలో, కంప్యూటర్ డిస్కులలో నిక్షిప్తమైన సమాచారాలను సమీక్షించడానికి పోలీసులు ఇంటర్‌పోల్ సహాయం కోరుతున్నారు. పైగా ఈ కేసులో అదనపు సాక్ష్యాలను చేర్చేందుకు కూడా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి జయలలితకు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన కనియన్ పూంగుండ్రన్ మంగళవారం ఉదయం కోయంబత్తూరు గాంధీపురంలోని సీబీసీఐడీ కార్యాలయంలో జరిగిన విచారణకు హాజరయ్యారు. జయ బతికున్నంత కాలం అధికార దర్పం ప్రదర్శించిన కనియన్ పూంగుండ్రన్ ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. పూంగుండ్రన్ ప్రస్తుతం తంజావూరు అరుళానందనగర్‌లోని తన బంధువుల ఇంట బసచేస్తూ వ్యవసాయ పనులలో నిమగ్నమై ఉన్నారు.


కోయంబత్తూరు గాంధీపురంలోని సీబీసీఐడీ కార్యాలయానికి వెళ్తున్న కనియన్ పూంగుండ్రన్

బస్సును ఢీకొన్న పాల ట్యాంకర్

ముగ్గురి మృతి ● 16 మందికి గాయాలు

టి.నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): కారైక్కుడి సమీపంలో రాష్ట్ర రవాణా సంస్థ బస్సును పాల ట్యాంకర్ ఢీకొనటంతో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో 16 మంది గాయపడ్డారు. తిరుచ్చి నుంచి రామేశ్వరానికి మంగళవారం వేకువజామున రాష్ట్ర రవాణా సంస్థ బస్సు బయలుదేరింది. అదే సమయంలో శివగంగ జిల్లా దేవకోట నుంచి కారైక్కుడికి పాల ట్యాంకర్ బయలుదేరింది. కారైక్కుడి తేనారు వంతెన సమీపంలో బస్సు, పాల ట్యాంకర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్యాంకర్‌లో ప్రయాణించిన దిండుగల్ జిల్లాకు చెందిన ఆరుముగం, కరుణా, తమిళ్‌పాండ్యన్ దుర్మరణం చెందారు. బస్సులో ప్రయాణించిన 13 మంది ప్రయాణికులు సహా మొత్తం 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన పాల ట్యాంకర్ డ్రైవర్ రూబన్, బస్ డ్రైవర్ నాగరాజ్, కండక్టర్ సెల్వేంద్రప్రసాద్‌ను మెరుగైన చికిత్స కోసం మదురై ఆస్పత్రికి తరలించారు. మిగతా 13 మందిని కారైక్కుడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కారైక్కుడి సౌత్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.


ధ్వంసమైన బస్సు. ఇన్‌సెట్‌లో నుజ్జునుజ్జైన పాల ట్యాంకర్

విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలి

● కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి ప్రభుత్వ మహోన్నత పాఠశాల మైదానంలో నూతనంగా నిర్మించిన ఇన్‌డోర్ స్టేడియాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలన్నారు. తమిళనాడు స్టార్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ ఇన్‌డోర్ స్టేడియంలో శిక్షణ తరగతులు అందించనున్నట్లు ఆ అకాడమీ నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడా ప్రాంగణంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ మేయర్ సుజాత, కాట్పాడి కమిటీ అధ్యక్షురాలు పుష్పలత, క్రీడాశాఖ అధికారి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


రిబ్బన్ కట్‌చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

తాగునీరు అందించాలంటూ రాస్తారోకో

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలోని సెయ్యూరులో తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు రాస్తారోకో చేపట్టారు. సెయ్యూరు పంచాయతీ పరిధిలో సుమారు 10,000 మంది నివసిస్తుండగా, ఉత్తర సెయ్యూరు ప్రాంత ప్రజలకు నది ఒడ్డున బావి తీసి విద్యుత్ మోటరు ద్వారా ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నీటిని పంపింగ్ చేసి, ప్రతిరోజు పైపుల ద్వారా తాగు నీరు అందిస్తుంటారు. మూడు నెలుగా నీటి కొరత కారణంగా సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోయింది. దీంతో సోమవారం సెయ్యూరు - నెల్లయంపాళయం రోడ్డుపై బైఠాయించారు. సమాచారం అందుకున్న సెయ్యూరు పోలీసులు అక్కడకు చేరుకుని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


రాస్తారోకోలో గ్రామస్తులు

గ్రేట్‌లేక్స్ కొత్త డైరెక్టర్‌గా దేబాషిస్ సన్యాల్ నియామకం

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రేట్ లేక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నూతన డైరెక్టర్‌గా డాక్టర్ దేబాషిస్ సన్యాల్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఆ సంస్థ డైరెక్టర్‌గా సేవలందించిన డాక్టర్ సురేష్ రామనాథన్ ఆరేళ్ల సర్వీసు పూర్తికావటంతో పదవీ విరమణ చేశారు. అపారమైన అనుభవం కలిగిన కొత్త డైరెక్టర్ సన్యాల్ అందించనున్న సేవలతో సంస్థ పురోగతి సాధిస్తుందని గ్రేట్ లేక్స్ సంస్థ ఛైర్మన్ మోహన్ లక్కారాజు తెలిపారు.



అబద్ధాలు చెబుతున్నారు

● మదురై ఆధీనంపై చర్యలు తీసుకోండి

అడయార్, మే 6 (ఆంధ్రజ్యోతి): మైనారిటీలకు వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేస్తున్న మదురై ఆధీనంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మదురై నగర పోలీసులకు జనానాయగ వాలిబర్ సంఘం ఫిర్యాదు చేసింది. ఇటీవల చెంగల్పట్టులోని ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిల భారత శైవ సిద్ధాంత సదస్సులో పాల్గొనేందుకు మదురై మఠం 293వ ఆధీనం తన సొంతకారులో వెళ్లారు. ఆయన కారు ఉళుందూరుపేట సమీపంలో వెళుతుండగా, మరో కారు ఢీకొనడంతో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంపై మదురై ఆధీనం మాట్లాడుతూ... పథకం ప్రకారమే తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారంటూ పేర్కొన్నారు. అలాగే, గత నెల 2న ఉళుందూరుపేటలో మదురై నుంచి చెన్నైకు వెళుతున్న ఆధీనం కారు ప్రమాదానికి గురైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

డయాలసిస్ బాధితులకు పౌష్టికాహారం

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో డయాలసిస్ చికిత్సలకు వచ్చే రోగులకు త్వరలో పౌష్టికాహారం అందజేయనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. డయాలసిస్ చికిత్స పొందుతున్న వారికి ప్రయోజనం చేకూరేలా ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పలు ప్రకటనలు చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 70 సమగ్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో డయాలసిస్ చికిత్స సేవలు త్వరలో ప్రారంభించనున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రుల్లో, డయాలసిస్ చికిత్సకు వచ్చే రోగులకు, పాలు, రెండు ఉడికించిన గుడ్లలోని తెల్లసొన, 50 గ్రాముల శనగలు, సోడియం, పొటాషియం తక్కువగా ఉన్న మూడు బిస్కెట్లు అందించనున్నారు.

అరుంబాక్కం శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ మండలం వార్డు 103లోని అరుంబాక్కం గ్యాస్ దహనవాటికలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా ఈ నెల 9 నుంచి 31వ తేది వరకు మూసివేయనున్నారు. ఆ రోజుల్లో ప్రజలు విల్లివాక్కం, వేలంగాడు ప్రాంతాల్లోని శ్మశానవాటికలు వినియోగించుకోవాలని చెన్నై కార్పొరేషన్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

ఉగ్రవాదంపై కేంద్రప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి: బీజేపీ


పార్టీ నేతలతో అశ్విన్‌కుమార్

తిరుత్తణి, మే 6 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ తిరువళ్లూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు అశ్విన్‌కుమార్ అధ్యక్షతన పళ్లిపట్టులో భారీ సభ ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ... పహల్గాం ఉగ్రవాదుల దాడి అమానుషమన్నారు. కేంద్రప్రభుత్వం ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. దాడిలో మృతిచెందిన 26 మందికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పళ్లిపట్టు బీజేపీ నాయకుడు కిరణ్, పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 77 వినతులు


పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం పోలీసు గ్రీవెన్స్ జరిగింది. గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌గా బాధ్యలు చేపట్టిన అరుణ్, ప్రజల సమస్యలు తెలుకొనేలా ప్రతి బుధవారం, నగర పోలీసు శాఖ అధికారులు, పోలీసులు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారు తమ సమస్యలు తెలుసుకునేలా ప్రతి మంగళవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన విషయం విదితమే. ఆ ప్రకారం, మంగళవారం నిర్వహించిన శిబిరంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, పోలీసులు పాల్గొని, బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనం తగ్గింపు సహా పలు సమస్యలపై 77 వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.


సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

దొడ్డబెట్ట సైట్ వద్ద ఏనుగు సంచారం

● పర్యాటకుల సందర్శనపై నిషేధం

టి.నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా దొడ్డబెట్టలో ఏనుగు సంచరించడంతో ఆ ప్రాంతంలో పర్యాటకుల సంచారంపై నిషేధించారు. రాష్ట్రంలో సముద్రమట్టానికి 2637 మీటర్ల ఎత్తులో ఉన్న పర్వత శిఖరంగా నీలగిరి జిల్లా దొడ్డబెట్ట పేరుగాంచింది. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధీనంలో ఉన్న ఆ ప్రాంతంలో ఊటీ, సరస్సులు, కున్నూరు నగరం, అవలాంచి డ్యాం, కొండలు లోయలను తిలకించడానికి ఎత్తయిన టెలిస్కోపు హౌస్ కూడా ఉంది. దొడ్డబెట్టకు సాధారణ రోజుల్లో 3 వేల మంది, సెలవు దినాలలో 8 వేల మంది పర్యాటకులు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో సోమవారం ఏనుగు దొడ్డబెట్టలోకి ప్రవేశించింది. ఆ ఏనుగును చూసి దిగ్భ్రాంతి చెందిన పర్యాటకులందరూ పరుగులు తీశారు. ఈ విషయమై స్థానిక అధికారులు అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రేంజర్ శశికుమార్ సిబ్బందితో వెళ్లి పర్యాటకులను తమ వాహనాల్లో కొండ దించారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో ఉన్న దుకాణాలను మూసి వేయాలంటూ ఆదేశాలిచ్చారు. ఆ తర్వాత ఆ ఏనుగును అటవీ శాఖ సిబ్బంది అడవిలోకి తరిమేశారు. ఈ సంఘటన నేపథ్యంలో మంగళవారం ఆ ప్రాంతానికి పర్యాటకులు వెళ్లకుండా నిషేధం విధించారు.


దొడ్డబెట్టా వద్ద సంచరిస్తున్న అడవి ఏనుగు

పట్టుకోటలో బీజేపీ మాజీ మహిళానేత దారుణహత్య

టి.నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పట్టుకోటలో బీజేపీ మాజీ మహిళా నేతను గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేశారు. మదురై జిల్లాకు చెందిన శరణ్య (35), మదురై సెంట్రల్ సిటీ బీజేపీ శాఖ మహిళా నేతగా పనిచేశారు. ఆమె భర్త షణ్ముగ సుందరం. వీరికి సాముయేల్, శరవణన్ కుమారులు ఉన్నారు. 2021లో భర్త చనిపోవడంతో శరణ్య, తన కుమారులతో కలిసి పట్టుకోటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె బాలన్‌ను రెండో వివాహం చేసుకుంది. వీరందరూ పట్టుకోట ఉదయసూర్యపురం చేపలమార్కెట్ వీధిలో నివసిస్తున్నారు. బాలన్ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థను, శరణ్య జిరాక్స్ దుకాణం నడుపుతుంటారు. వారిద్దరు ఉదయం దుకాణాలకు బైకుపై వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి బాలన్ తన దుకాణాన్ని మూసివేసి ఇద్దరు కుమారులతో బైకులో ఇంటికి బయలుదేరారు. శరణ్య ఆమె దుకాణాన్ని మూసివేసి అక్కడి నుంచి సుమారు కిలోమీటర్ దూరం ఉన్న ఇంటికి కాలినడకనే బయలుదేరింది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను వెంబడించి, చీకటి ప్రాంతంలో వేటకొడవళ్లతో తల నరికి పారిపోయారు. ఈ దాడిలో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. శరణ్య ఎంతకీ ఇంటికి రాకపోవటంతో బాలన్ ఆమెను వెదుక్కుంటూ వెళ్లగా ఆ ఇంటికి కూతవేటు దూరంలో తల తెగిన స్థితిలో నిర్జీవంగా పడి ఉండటం గమనించాడు. సమాచారం అందుకున్న వట్టాత్తికోట పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పట్టుకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురి లొంగుబాటు...

ఈ హత్యకేసుకు సంబంధించి కపిలన్, గుహన్, పార్తిబన్ మదురై జిల్లా కోర్టులో మంగళవారం ఉదయం లొంగిపోయారు. ఆస్తి తగాదాల కారణంగా శరణ్యను హతమార్చినట్లు పేర్కొన్నారు. లొంగిపోయిన ముగ్గురిలో కపిలన్ శరణ్య భర్త బాలన్ మొదటి భార్య కుమారుడని పోలీసులు తెలిపారు.


హత్యాస్థలం వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) శరణ్య (ఫైల్‌ఫోటో)

తిరువళ్లూరు తీర్థకొలనులో మునిగి ముగ్గురు వేదపాఠశాల విద్యార్థుల మృతి

చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు వీరరాఘవపెరుమాళ్ ఆలయ తీర్థ కొలనులో జారిపడి సేలయూరు వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు దుర్మరణం చెందారు.వీరరాఘవపెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం చిత్తిరై బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో చెంగల్పట్టు జిల్లా సేలయూరుకు చెందిన మఠంలోని వేద పాఠశాలలో హరిహరన్(16), వెంకటరామన్(17), వీరరాఘవన్ (24) పారాయణం పఠిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు విద్యార్థులు మంగళవారం ఉదయం తీర్థకొలను ఒడ్డున నీటిలో నిలిచి సూర్యనమస్కారం చేస్తుంగా ఓ విద్యార్థి జారిపడి నీటిలో మునిగాడు. వెంటనే ఇద్దరు విద్యార్థులు అతన్ని కాపాడే యత్నంలో మునిగిపోయారు. ఈ విషయమై స్థానికుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక దళం సభ్యులు కొలనులో దిగి గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను వెలికితీసి తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పట్టపగలు రోడ్డు దాటిన చిరుత

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో పట్టపగలు చిరుత రోడ్డు దాటడం గమనించిన వాహనచోదకులు భయాందోళనలకు గురయ్యారు. వేసవి కారణంగా అడవుల్లో తాగు నీరు, ఆహారం లభించకపోవడంతో జంతువులు సమీపంలోని జనావాస ప్రాంతాలకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సత్యమంగళం సమీపం పన్నారి చెక్‌పోస్ట్ వద్ద సోమవారం సాయంత్రం చిరుత పరిగెడుతూ రోడ్డు దాటడం గమనించిన వాహనచోదకులు దిగ్భ్రాంతి చెందారు. కొందరు చిరుత రోడ్డు దాటే దృశ్యాలు వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.


రోడ్డు దాటుతున్న చిరుత పులి

కలెక్టర్ కారును ధ్వంసం చేసిన గుర్రాలు

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కారును ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు. నీలగిరి జిల్లా ఊటీ నగరంలోని ప్రధాన రహదారులైన పింకర్ పోస్ట్, బర్న్‌హిల్, బొటానికల్ గార్డెన్, బస్టాండ్, కమర్షియల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో గుర్రాలు అధిక సంఖ్యలో సంచరిస్తుంటాయి. రోడ్లపై గుర్రాల సంచారంతో పాదచారులు, వాహన చోదకులు భయంతో వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య బర్న్‌హిల్ ప్రాంతంలో కార్ పార్కింగ్ చేసి వెళ్లారు. ఆ సమయంలో అటుగా వచ్చిన గుర్రాల మంద కలెక్టర్ వాహనాన్ని ఢీకొనడంతో, వాహన అద్దాలు పగిలిపోయాయి. అనంతరం మరో కారులో కలెక్టర్ వెళ్లిపోయారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ ఫిర్యాదుపై ఊటీ జీ1 పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశీలన్, ఇద్దరిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.


ఊటీ రోడ్లపై సంచరిస్తున్న గుర్రాలు

జైలు ఖైదీలకు క్రీడాపోటీలు

వేలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు సెంట్రల్ జైలులో మంగళవారం క్రీడా వారోత్సవాల్లో భాగంగా ఖైదీలకు క్రీడా పోటీలు నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ ధర్మరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్విజ్, వక్తృత్వ, కబ్బడీ తదితర పోటీల్లో ఖైదీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు అరుణ్, మోహన్, జగజీవన్, విమల తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న ధర్మరాజ్

డస్ట్‌బిన్ల పంపిణీ

వేలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు కార్పొరేషన్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు వేలూరు సీఎంసీ ఆస్పత్రి సమీపంలోని గాంధీరోడ్డు ప్రజలకు మంగళవారం ఉదయం కార్పొరేషన్ అధికారి శివకుమార్ ఆధ్వర్యంలో డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త లేని సమాజంవైపు దేశం నడుస్తుందన్నారు. ఇంట్లో చెత్తను తడిచెత్త, పొడిచెత్తగా వేరుచేసి, కార్పొరేషన్ కార్మికులకు అందజేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


ప్రజలకు డస్ట్‌బిన్‌లను అందజేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తండ్రి సమాధి వద్ద కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్యారీస్, మే 6 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కొల్లంగోడు సమీపంలోని వారుదుడ్డుకి చెందిన కానిస్టేబుల్ తన తండ్రి సమాధి వద్ద ఆత్మహత్య చేసుకున్నారు. కన్నియాకుమారి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన సంపత్‌చంద్ర (38), అరుల్‌సేని (36) దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో, గత నెల 24న వారుదుడ్డు ప్రాంతంలోవున్న తన తండ్రి సమాధి వద్దకు వెళ్ళిన సంపత్‌చంద్ర విషం తాగి అపస్మారక స్థితిలో ఉండటం చూసిన కాటికాపరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడికి చేరుకుని సంపత్‌చంద్రను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్సలు ఫలించక సోమవారం రాత్రి సంపత్‌చంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో మరొకరి అరెస్టు

అడయార్, మే 6 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో ప్రముఖ రౌడీ నాగేంద్రన్ రెండో కుమారుడు అజిత్‌రాజ్‌ను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో ప్రముఖ రౌడీ నాగేంద్రన్, ఆయన కుమారుడు అశ్వత్థామతో సహా 27 మందిని నగర పోలీసులు అరెస్టు చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో నాగేంద్రన్ రెండో కుమారుడు అజిత్‌రాజ్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఆయన వద్ద పోలీసులు విచారణ జరుపుతున్నారు.

చిత్రజ్యోతి



జీవితాంతం శింబుకు అండగా ఉంటా

● సంతానం

తాను బాగుండాలని కోరుకునే హీరో శింబుకు జీవితాంతం అండగా ఉంటానని హీరో సంతానం అన్నారు. ప్రేమ్ ఆనంద్ దర్శకత్వంలో సంతానం హీరోగా నటించిన తాజా చిత్రం 'డెవిల్స్ డబుల్ (డిడి) నెక్స్ట్ లెవల్'. హీరో ఆర్య నిర్మాత. ఈ నెల 16న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్రం ఆడియో, ట్రైలర్‌ను సోమవారం రాత్రి చెన్నైలో ఆవిష్కరించారు. హీరో శింబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంతానం మాట్లాడుతూ, "దిల్లుక్కు దుడ్డు', 'డిడి' సిరీస్ చిత్రాలకు నాకు ఎంతగానో సాయం చేసిన రచయిత సౌందర్‌రాజన్. ఆయన ఇప్పుడు మన మధ్య లేకపోయినప్పటికీ ఆయనకు ధన్యవాదాలు. శింబు నటించిన 'కాదల్ అళివదిల్లై' చిత్రంలో ఓ చిన్న వేషం వేశా. నా నటన చూసి 'మన్మథన్' చిత్రంలో నా ఎంట్రీ సన్నివేశాన్ని అద్భుతంగా చూపించారు. ఆ సన్నివేశానికి ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేనిది. అలాగే, నేను నటించే ప్రతి చిత్రం బాగారావాలని, నేను బాగుండాలని కోరునే వ్యక్తి శింబు. 'ఎస్‌టీఆర్49'లో నా పాత్ర బాగుండాలని దర్శక నిర్మాతలకు సింబు చెప్పారు. ఈ చిత్రానికి హీరో ఆర్య నిర్మాత. శింబును ఉద్దేశించి ఏం మాట్లాడుతారా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. కాలేజీ స్టోరీలో నేను, ఆర్య స్నేహితులుగా నటించాం. ఆ సినిమా బాగా రీచ్ అయింది. వెంటనే నన్ను కామెడీ సూపర్‌స్టార్ అంటూ ఆర్య పిలవసాగారు. 'సేట్టై' సినిమా టైటిల్ కార్డులో నాకు సూపర్ స్టార్ అనే పేరు వేశారు. ఆ తర్వాత 'లింగా' సినిమాలో నటించే సమయంలో రజనీకాంత్ నన్ను చూసి నీవు సూపర్‌స్టారా? అని అడగ్గా...కాదు,ఆర్యనే ఆ ట్యాగ్ పెట్టారు అని చెప్పా. అలా తలైవర్ వద్ద నన్ను ఆర్య ఇరికించారు. నిజ జీవితంలోనే హాస్యాన్ని పండిస్తుంటారు. ఆర్య, నేను ఎంతో కాలంగా స్నేహితులం. ఒక పని చేసేందుకు ఏమాత్రం వెనుకంజ వేయం. హర్రర్ జానర్‌లో దర్శకుడు గౌతమ్‌మేనన్, సెల్వరాఘవన్ ఎన్నడూ లేని విధంగా నటించారు. రామాయణంలో రాముడికి గొప్ప పేరు రావడానికి సీత, లక్ష్మణు, రావణుడితోపాటు అనేక మందికి కారణం. అలాగే, నా సక్సెస్‌కు మా అమ్మ, భార్య, పిల్లలు, అభిమానులకు భాగస్వామ్యం ఉంది' అన్నారు.

'టూరిస్ట్ ఫ్యామిలీ'కి మంత్రి సుబ్రమణ్యం ప్రశంస

సీనియర్ నటుడు శశికుమార్,నటి సిమ్రాన్ జంటగా నటించిన 'టూరిస్ట్ ఫ్యామిలీ'ని తన కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. నటుడు శశికుమార్, దర్శకుడు అభినేష్ జీవింత్‌కు ఆయన స్వయంగా ఫోన్ చేసి ప్రశంసించారు. నిర్మాత యువరాజ్ గణేషన్ నిర్మించిన ఈ మూవీ ఇటీవల విడుదలైంది. ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టడంతో ఈ సినిమాను ప్రదర్శించే థియేటర్ల సంఖ్య కూడా పెంచారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాను తన కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్‌కు వెళ్లి చూసిన మంత్రి సుబ్రహ్మణ్యం ట్వీట్ చేస్తూ, 'టూరిస్ట్ ఫ్యామిలీ' నిజంగా నా హృదయాన్ని టచ్ చేసింది. ఈ సినిమా మన పొరుగువారితో మానవీయ సంబంధాలు, ప్రేమతో జీవించడం నేర్పుతుంది. ప్రతి ఒక్కరినీ మానవీయంగా జీవించడానికి, మనల్ని మనం ప్రేమించుకోవడానికి నేర్పుతుంది' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రంలో శశికుమార్ ప్రేమ, కరుణ, దయాగుణాలు కలిగిన వ్యక్తిగా జీవించారు. ఒక మంచి కుటుంబం ఒక విశ్వవిద్యాలయం అని చూపించే అద్భుత చిత్రం. నాకు సమయం చిక్కినపుడల్లా థియేటర్లలో సినిమాలు చూస్తా.అలాగే, ఈ రోజు 'టూరిస్ట్ ఫ్యామిలీ' చూశా' అని మంత్రి ట్వీట్ చేశారు.



'టూరిస్ట్ ఫ్యామిలీ'లో ఓ దృశ్యం



రుక్కుగా అభిమానులను అలరిస్తున్న పూజా హెగ్డే

కార్తిక్ సుబ్బురాజ్ దర్శకత్వంలో సూర్య హీరోగా నటించిన 'రెట్రో'లో రుక్మిణి (రుక్కు) పాత్రలో హీరోయిన్ పూజా హెగ్డే నటించి ఆమె అభిమానులతో పాటు ప్రేక్షకులను మెప్పించారు. సాధారణంగా సినిమాల్లోని కొన్ని పాత్రలు ప్రేక్షకులపై ప్రభావం చూపుతాయి. అలాంటి పాత్రను ఈ మూవీలో పూజా హెగ్డే పోషించారని ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. తెరపై ఆమె కనిపించిన తొలి సన్నివేశం నుంచి ఎండ్ కార్డు పడేంతవరకు ఒక నటిగా కాకుండా, మనకు తెలిసిన, పొరుగింటి యువతిగా కనిపించారు. ఆమె పాత్రలో పెద్దగా మాటలు ఉండవు. కేవలం తన హావభావాల ద్వారానే ఆమె అద్భుతంగా నటించారు. ఆమె కళ్లలో తనలోని బాధ, ప్రేమ, ఆశను వ్యక్తపరిచారు. రుక్కు పాత్ర ఆమె నటించిన గత చిత్రాల్లోని పాత్రల కంటే పూర్తిగా భిన్నమైనదిగా ఉందని అభిమానులు అంటున్నారు. ఈ సినిమాలోని పూజా హెగ్డే సన్నివేశాలకు సంబంధించిన క్లిప్పింగ్స్ వైరల్ అవుతున్నాయి. కాగా, ప్రస్తుతం ఆమె తమిళంలో 'జననాయగన్', 'కూలీ', 'కాంచన-4' చిత్రాల్లో నటిస్తున్నారు.

3 వారాల తర్వాత యాక్టివేట్ అయ్యింది : ఖుష్బూ



బీజేపీ మహిళా నేత, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ ఎక్స్ ఖాతా సేవలను పునరుద్ధరించారు. ఆమె ఖాతా మూడు వారాల క్రితం హ్యాకయ్యింది. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు చర్యలు తీసుకోవడంతో ఎక్స్ ఖాతాను పునరుద్ధరించారు. ఈ విషయాన్ని ఖుష్బూ తన ఇన్‌స్టా ఖాతాలో వెల్లడించారు. 'గత మూడు వారాలుగా ఒక్క పోస్ట్ కూడా చేయలేదు. ఇపుడు మళ్లీ నా ఎక్స్ ఖాతా పునరుద్ధరించారు. ఈ మూడు వారాల్లో మీ అందరినీ మిస్ అయ్యా. ఇక నుంచి మళ్లీ అన్ని అంశాలను షేర్ చేసుకుంటాను. నాలోని అన్ని భావాలను మీతో పంచుకుంటా. ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.



కర్రసాములో విద్యార్థులు

102 నిమిషాలు కర్రసాము

పెరంబూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లాలో నోబుల్ సాధన కోసం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు 102 నిమిషాలు కర్రసాము చేశారు. పల్లడం సమీపం కేత్తనూరు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో సోమవారం ఈ సాము నిర్వహించారు. 'ఒక రైతు' చిత్రం నమూనాలో నిలబడిన విద్యార్థులు 102 నిమిషాలు వివిధ విన్యాసాలతో కర్రసాము చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశామని, ఈ సాధనను నోబుల్ సంస్థకు పంపినట్లు నిర్వాహకులు తెలిపారు.

సమయపురం మారియమ్మన్ ఆలయంలో పంచ ప్రాకార ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్యారీస్, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలోని సమయపురం మారియమ్మన్ ఆలయంలో ఎనిమిది రోజుల పంచ ప్రాకార ఉత్సవాలు మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యాయి. శక్తి క్షేత్రాల్లో ప్రసిద్ధిగాంచిన సమయపురం మారియమ్మన్ ఆలయంలో ఈనెల 13వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వృషభ, గజ, అశ్వ, హంస, సింహ, పులి తదితర వాహనాల్లో ప్రతిరోజు రాత్రి 8 గంటలకు ఊరేగిస్తారు. పదో రోజైన 15వ తేదీ అమ్మవారికి విశేషమైన పంచప్రాకార తిరుమంజనం ఉత్సవం ఉదయం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉన్న తీర్థకొలనులో నిర్వహిస్తారు. 17వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు ముత్యాల పల్లకీలో అమ్మవారి ఊరేగింపు, 18వ తేదీ రాత్రి 10 గంటలకు స్వర్ణకమల వాహనంలో అమ్మవారు విహరించి భక్తులను కటాక్షిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థలు పలు ప్రాంతాలనుంచి సమయపురానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి. ఇదిలా ఉండగా రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఘనంగా శ్రీకృష్ణ గీతా సమాజం స్వర్ణోత్సవం



భక్తిగీతాలు ఆలపిస్తున్న అరుణా శ్రీనాథ్

ప్యారీస్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతచాకలిపేట శ్రీ కన్నికలమ్మ దేవాలయ ప్రాంగణంలో శ్రీకృష్ణ గీతా సమాజం స్వర్ణోత్సవం ఆదివారం ప్రారంభమై ఘనంగా జరుగుతోంది. నగర సంకీర్తన, ప్రణవ పతాక ప్రతిష్ఠ, పారాయణం, గోపూజ, గణపతి హోమంతో ప్రారంభమైన ఈ వేడుకలు ఈ నెల 21వ తేదీవరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు భక్తి సంగీత విభావరి వీనులవిందుగా సాగింది. ప్రముఖ గాయని అరుణా శ్రీనాథ్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఆర్ సుబ్రహ్మణ్యం... మహా గణపతి, బ్రహ్మమొక్కటే, సౌభాగ్యలక్ష్మి రావమ్మా, అన్నమయ్య కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి శ్రోతలను అలరించారు. వారికి రమేష్ (వయోలిన్), పార్థసారథి (మృదంగం) వాయిద్య సహకారం అందించారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీమద్భాగవద్గీతపై స్వామి స్వస్వరూపానందగిరి ప్రవచన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ నిర్వాహకులు జీకే జగదీశ్వర్, ఇతర సభ్యులు కళాకారులను జ్ఞాపికలతో ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

ఫీనిక్స్ మాల్‌లో 'హలో కిట్టి అండ్ ఫ్రెండ్స్ ఫన్ ఫెయిర్'



ఫీనిక్స్ మాల్‌లో హలో కిట్టి అండ్ ఫ్రెండ్స్ ఫన్ ఫెయిర్

అడయార్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మాల్‌లో నగరవాసులకు వేసవి వినోదాన్ని అందించే అనేక ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, హలో కిట్టి అండ్ ఫ్రెండ్స్ ఫన్ ఫెయిర్‌ను ప్రారంభించారు. హాలిడే ల్యాండ్ పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులు, పెద్దలకు వినోదాన్ని పంచే టవరింగ్ సర్కస్, టెంట్స్, స్పిన్నింగ్ వీల్స్, కాషన్ షీట్స్, మిని ఫెర్రిస్ వీల్స్, కలర్ మ్యూజిక్, లైట్స్, కలర్ ఇలాంటి ఎన్నో రకాలైన వినోద అంశాలున్నాయి. ఈ ప్రారంభ కార్యక్రమంలో 30 మందికిపైగా చిన్నారులు, తల్లులు స్వాగతం పలికారు.

ఆయుధాలు దాచినవారి ప్రాణాలు తోడేస్తాం

● ఆంగ్లేయుల రాగిఫలకంలో హెచ్చరిక ● వీరపాండ్యకట్ట బ్రహ్మన్న చరిత్రకు సాక్ష్యం

● ఫలకాన్ని కాపాడుతున్న పావాలి గ్రామస్తులు



శిలాఫలకంపై తమిళ అక్షరాలను పరిశీలిస్తున్న కందసామి

టి.నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయ పాలకులు స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబ్రహ్మన్నకు ఉరిశిక్షను అమలు చేసిన తర్వాత ఎవరైనా పేలుడు పదార్థాలు దాస్తే వారి ప్రాణాలు తీస్తామంటూ వెలువరించిన రాగి శిలాఫలకం విరుదునగర్ సమీపంలోని పావాలి గ్రామంలో ఆ నాటి చరిత్రకు సాక్ష్యం చెబుతోంది. ఆ రాగి శిలాఫలకాన్ని స్థానికులు, పురావస్తు పరిశోధకులు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. విరుదునగర్‌లో సమీపంలోని తల్లె గ్రామం అని పిలిచే పావాలి శతాబ్దాలనాటి ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలకు ఆలవాలంగా ఉంటోంది. పావాలి గ్రామం జమీందార్ల ఏలుబడిలో ఉన్నప్పుడు తిరునల్వేలి సీమను పరిపాలిస్తున్న ఆంగ్లేయ దొర మేజర్ బేనర్‌మేన్ జారీ చేసిన ఉత్తర్వుకు సంబంధించిన రాగి ఫలకాన్ని 1799లో అక్టోబర్ 21న రాతిస్తంభంపై ప్రతిష్ఠించారు. కట్టబ్రహ్మన్నను ఉరితీసిన తర్వాత.. ఎవరైనా పేలుడు పదార్థాలు, ఆయుధాలు, ఫిరంగులు వంటి ఆయుధాలను కలిగి ఉంటే, వారిని హెచ్చరించే విధానంలో తమిళ అక్షరాలతో ఆ రాగి ఫలకం చెక్కబడి ఉంది. ఆ ఫలకంలో 'ఇకపై ఏ పాళయకారుడైనా పన్నులు, వడ్డీలు చెల్లించకుండా కోట బురుజులపై దాడి జరిపినా, ఫిరంగులు, జెండాలు, కత్తులు, ఈటెలు దాచినా కుంపణీ (ఆంగ్లేయుల సంస్థ) ఆదరణలు కోల్పోవడమే గాక వారి ఆస్తిపాస్తులను జప్తు చేసుకుని, వారిని శత్రువులుగా పరిగణించడమే కాకుండా దండిస్తాం. పాళెగార్ల ప్రాంతాల్లో సేవకులు, కాపలాదార్లు, గ్రామ ప్రతినిధులు ఎవరైనా నాటుబాంబులు, సీమ బాంబులు, పిడిబాకులు, పికాసులు వంటి ఆయుధాలను దాచి ఉంచినట్లు తెలిస్తే ఆయా పాళెగార్లు దండించబడతారు. వీరిలో ఎవరు తప్పు చేసినా తమదే బాధ్యత అని పాళెగార్లు భరోసా ఇవ్వాలి. వీటన్నింటిని అతిక్రమించి ఎవరైనా ఆయుధాలతో పట్టుబడితే వారి ప్రాణాలు తీస్తాం. ఈ సంగతులు దండోరా వేస్తాం' అని హెచ్చరించే ధోరణిలో ఈ వివరాలు ఆ రాగి శిలాఫలకంలో చెక్కబడి ఉన్నాయి. ఈ విషయమై పురావస్తు పరిశోధకుడు కందసామి మాట్లాడుతూ... పావాలి గ్రామంలోనే కాకుండా తూత్తుకుడి జిల్లా ఎట్టయపురం, విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపం కొళ్లపట్టి తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఆంగ్లేయుల కాలం నాటి రాగి ఫలకాలు ఉండేవనీ, వాటి సంరక్షించక పోవడంతో కాల గర్భంలోకలిసి పోయాయని చెప్పారు. పావాలి గ్రామంలో ఎన్నో యేళ్లగా అతీగతీ లేకుండా పడి ఉన్న ఈ రాగి ఫలకం గొప్పదనం గురించి తెలుసుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారని తెలిపారు. ఆ ఫలకంలోని వివరాలను ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో ఓ భారీ శిలాఫలకాన్ని కూడా ఏర్పాటు చేశారని చెప్పారు.



పావాలి గ్రామంలోని వీరపాండ్యకట్ట బ్రహ్మన్న జీవిత విశేషాల శిలాఫలకం





స్కేటింగ్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ ప్రియ - స్కేటింగ్ శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

వ్యాసర్పాడి ఎంకేబీ నగర్‌లో స్కేటింగ్ గ్రౌండ్ ప్రారంభం

ప్యారీస్, మే 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి ఎంకేబీ నగర్‌లో చిన్నారుల కోసం నిర్మించిన స్కేటింగ్ గ్రౌండ్ ప్రారంభోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. 37వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీబాబు తన వార్డు అభివృద్ధి నిధులనుండి కేటాయించిన రూ.30 లక్షలతో ఈ స్కేటింగ్ గ్రౌండును నిర్మించారు. ప్రారంభోత్సవంలో హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, నగర మేయర్ ప్రియ, ఎమ్మెల్యే ఆర్డీ శేఖర్, జోన్ చైర్మన్ నేతాజీ గణేశన్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్కేటింగ్ శిక్షణలో పాల్గొన్న చిన్నారులను ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేశారు.

మదురై మీనాక్షి ఆలయ చిత్తిరై ఉత్సవాల్లో

దేవతామూర్తుల వేషాలతో చిన్నారుల సందడి







చెన్నై, మే 6 (ఆంధ్రజ్యోతి): నిదుర పోని నగరంగా, తమిళభాషా సంఘాల ఆవిర్భావ ప్రాంతంగా, ప్రసిద్ధ శైవక్షేత్రంగా కీర్తిగడించిన మదురై నగర సామ్రాజ్ఞి మీనాక్షి అమ్మవారి ఆలయ చిత్తిరై వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఏప్రిల్ 29న ప్రారంభమైన ఈ వేడుకల్లో ప్రతిరోజూ మీనాక్షి, సుందరేశ్వరర్ వివిధ వాహనాల్లో విహరిస్తూ కనువిందు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మీనాక్షి అమ్మవారి పట్టాభిషేక వేడుకలు జరగనుండటంతో ఉదయమే ఆ ఆలయంలో వేలాదిమంది భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆ సందర్భంగా చిన్నారులు దేవతామూర్తుల వేషధారణతో ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ సందడి చేశారు. బాలికలు మీనాక్షి అమ్మవారి వేషధారణలో చేత చిలుకబొమ్మను పట్టుకుని నడచుకుంటూ వెళ్లారు. ఇదే రీతిలో బాలురు సుందరేశ్వరర్ వేషధారణతో కనువిందు చేశారు. మంగళవారం రాత్రి అట్టహాసంగా మీనాక్షి అమ్మవారి పట్టాభిషేక మహోత్సవం జరిగింది. ఈ నెల 8న మీనాక్షి సుందరేశ్వరర్ తిరుకళ్యాణోత్సవం, మరుసటి రోజు మహారథోత్సవం నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు, ట్రస్టుబోర్డు సభ్యులు తగు ఏర్పాట్లు చేపడతున్నారు.

11,962 ట్రాక్టర్లను విక్రయించిన సోనాలిక

అడయార్, మే 6 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ల తయారీ కంపెనీల్లో ఒకటైన సోనాలిక ఏప్రిల్ నెలలో ఏకంగా 11,962 యూనిట్లను విక్రయించినట్టు మంగళవారం వెల్లడించింది. ఈ విషయంపై ఆ కంపెనీ ఇంటర్నేషనల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రమన్ మిట్టల్ మాట్లాడుతూ... ఈ యేడాది ఏప్రిల్‌లో ట్రాక్టర్ల విక్రయాలతో కొత్త ఆర్థిక సంవత్సరాన్ని సానుకూలంగా ప్రారంభించామన్నారు. హెవీ డ్యూటీ ట్రాక్టర్లను వ్యూహాత్మకంగా తయారు చేశామన్నారు. ఆప్టిమైజ్డ్ ఖర్చుతో రైతు పనితీరును పెంచడానికి తమ వాహనాలు సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. సోనాలిక ట్రాక్టర్లు ఎల్లప్పుడూ వాటాదారుల ఆసక్తిని పెంచుతాయన్నారు. ప్రధానంగా రైతులను ఎల్లవేళలా సంతోషంగా ఉంచేలా అత్యుత్తమ నాణ్యతతో ట్రాక్టర్లు తయారు చేసి అందించడంలో రాజీ పడబోమన్నారు.





డయాలసిస్ సెంటర్ ప్రారంభంలో మంత్రి సుబ్రహ్మణ్యం

పోరూర్‌లో రోటరీ డయాలసిస్ సెంటర్ ప్రారంభం

అడయార్, మే 6 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ వెస్ట్ రౌండ్‌టేబుల్ 10 (ఎండబ్ల్యూఆర్‌టీ-10), రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై సంయుక్తంగా తమ రెండో విడత కార్యక్రమంలో భాగంగా పోరూర్‌లో 19 పడకల డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఇందులో మధురవాయల్ ఎమ్మెల్యే కె.జ్ఞానపతి, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3233 డిస్ట్రిక్ట్ గవర్నర్ మహావీర్ బోత్రా, రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 2 ఏరియా చైర్మన్ కునాల్ చౌద, రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై క్యాపిటల్ ప్రెసిడెంట్ హేమంత్ కందల్‌వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమంత్ కందల్‌వాల్ మాట్లాడుతూ... 'దేశంలో నానాటికీ మూత్రపిండాల సమస్యలు పెరిగిపోతున్నాయి. ఈ సమస్యపై మరింత అవగాహన కల్పించడంతో పాటు రోగులకు సేవ చేసేందుకు ఈ సెంటర్‌ను నెలకొల్పాం. ఆరోగ్య సంరక్షణ ప్రాథమిక హక్కు అని, దాన్ని ప్రతి ఒక్కరూ పొందాలన్నదే తమ ముఖ్య ఉద్దేశం' అన్నారు.



పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

తిరుమల, మే6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలోని 'దశావతార-అష్ట లక్ష్మి' మండపంలో మంగళవారం సాయంత్రం పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజైన మంగళవారం మలయప్పస్వామి గజవాహనంపై కొలువుదీరి ఉభయనాంచారులతో కలిసి మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. వివిధ హంగులతో శోభిల్లుతున్న పెండ్లి మండపంలో నిత్య నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లకు ఎదుర్కోలు, మాల పరివర్తనం, పూలబంతులాట, నూతన పట్టువస్త్రాల సమర్పణ కోలాహలంగా జరిగాయి. స్వామికి కొలువు నిర్వహించాక చతుర్వేద పారాయణం, మలహారి, దేశిక, సౌరాష్ట్ర, వారహి, కదన కుతూహల, నీలంబరి వంటి వివిధ రాగ-తాళ వాయిద్యాల నడుమ స్వామి వార్ల కల్యాణం జరిగింది. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించాక శ్రీదేవి, భూదేవి సహితుడైన స్వామి అశేష భక్త జనం మధ్య ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యురాలు పనబాక లక్ష్మి, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, పెండ్లి మండపాన్ని టన్ను పండ్లు, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 వేల కట్ ఫ్లవర్స్‌తో దాదాపు 150 మంది గార్డెన్ సిబ్బంది, 50 మంది ఎలక్ట్రిక్ సిబ్బంది అలంకరించారు.

పెలికాన్ పక్షికి వడదెబ్బ



సూళ్లూరుపేట టోల్‌ప్లాజా వద్ద ఓ ఇంటి సమీపంలో పెలికాన్ పక్షికి వడదెబ్బ తగిలి పడిపోయింది. నెర్రికాలువ వద్ద సేదతీరుతున్న పెలికాన్ పక్షికి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలింది. స్థానికులు గమనించి వన్య ప్రాణి అధికారులకు సమాచారం ఇవ్వగా.. వారు పెలికాన్ పక్షికి పశువైద్య శాలలో వైద్య పరీక్షలు చేయించి కుదిరి చెరువులో విడిచిపెట్టారు. పెలికాన్‌ను రక్షించిన సిబ్బందిని డీఎఫ్‌వో హారిక, ఎఫ్ఆర్‌వో నరసింహారావు అభినందిచారు.

– సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సత్యవేడు కొలిక్కి వస్తుందా?

● టీడీపీ కోటలో వర్గాలతో బీటలు ● నారా లోకేశ్ కొలిక్కి తెస్తారని శ్రేణుల్లో ఆశలు

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): యువనేత, మంత్రి నారా లోకేశ్ బుధవారం సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులతో సమావేశం అవుతుండడంతో ఇక్కడి రాజకీయాలపై జిల్లా అంతా ఆసక్తి నెలకొంది. టీడీపీకి తొలి నుంచీ బలమైన పట్టున్న నియోజకవర్గంలో వర్గవిభేదాలు తారస్థాయిలో ఉన్న సమయంలో లోకేశ్ ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ తొలగుతుందా? నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించబోతున్నారు? అనే అంశాలు చర్చగా మారిన నేపథ్యంలో లోకేశ్ అన్నీ చక్కదిద్దుతారనే ఆశాభావంతో ఆ పార్టీ శ్రేణులు ఉన్నాయి.

తొలినుంచీ నాయకత్వ సంక్షోభమే!

సత్యవేడు నియోజకవర్గం తొలి నుంచీ టీడీపీకి బాగా పట్టున్న ప్రాంతం. పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ పది సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు సార్లు టీడీపీ అభ్యర్థులు గెలిచారు. టీడీపీ నేతల నడుమ వర్గ విభేదాల కారణంగానే ఆ మూడు సార్లూ ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నియోజకవర్గంలో తొలినుంచీ టీడీపీకి నాయకత్వ సమస్య ఎదురవుతూనే వుంది. తొలి ఎన్నికల్లో పోటీ చేసిన తలారి మనోహర్ మొదలుకుని తర్వాత వచ్చిన సురాజ్, నారమల్లి శివప్రసాద్, హేమలత, తలారి ఆదిత్యతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వరకూ ఎవరూ బలంగా నిలదొక్కుకోలేకపోయారు. ఐదేళ్లలోపే పార్టీ నుంచీ బలమైన వ్యతిరేకత ఎదుర్కొనడం, తదుపరి ఎన్నికల్లో టికెట్ కోల్పోవడం, నియోజకవర్గ ముఖచిత్రం నుంచీ తెరమరుగు కావడం జరుగుతోంది.

ఐదేళ్ల నుంచీ దారీ తెన్నూ లేని పార్టీగా..

గత ఐదేళ్లు సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ మరీ దారుణ పరిస్థితులను ఎదుర్కొంది. 2014 ఎన్నికల్లో గెలిచిన తలారి ఆదిత్యకు 2019లో టికెట్ దక్కలేదు. 2019 ఎన్నికల్లో పార్టీ టికెట్‌పై పోటీ చేసిన జేడీ రాజశేఖర్ ఓడిపోయారు.



సత్యవేడులో లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఆ తర్వాత ఆయనకు ఇంచార్జి పదవి దక్కలేదు. కొంత కాలం ఇంచార్జి లేకుండా గడిచాక మాజీ ఎమ్మెల్యే హేమలతకు ఆ బాధ్యతలు అప్పగించారు. నెలల వ్యవధిలోనే ఆమెను తప్పించి ఆమె కుమార్తె డాక్టర్ హెలెన్‌కు ఇంచార్జి ఇచ్చారు. దీంతో నియోజకవర్గంలో హేమలత (హెలెన్) వర్గం, జేడీ రాజశేఖర్ వర్గాలు ఏర్పడ్డాయి. తీరా 2024 ఎన్నికల్లో వీరిద్దరినీ పక్కన పెట్టి అధిష్ఠానం అధిష్ఠానం వైసీపీ నుంచీ వచ్చిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి టికెట్ ఇచ్చింది. ఆయన గెలుపునకు హేమలత, రాజశేఖర్ వర్గాలు పనిచేయలేదు. రాజశేఖర్ ఇండిపెంటెండ్‌గా పోటీ చేశారు. హేమలత వర్గం మరో ఇండిపెండెంట్ రమేష్‌కు మద్దతిచ్చింది. అయితే కోనేటి ఆదిమూలం ఇంతటి ప్రతికూలతను కూడా అధిగమించి పార్టీ సానుకూల ప్రభంజనం వల్ల ఎమ్మెల్యేగా గెలిచారు.

సస్పెన్షన్‌లోనే ఆదిమూలం

గెలిచినా కోనేటి ఆదిమూలం రాజకీయంగా స్థిరంగా అయితే లేరు. టీడీపీ వారికి కాకుండా వైసీపీ నుంచీ తన వెంట వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అధిష్ఠానానికి ఫిర్యాదులు వెళ్లాయి. దీనికితోడు ఓ మహిళతో వివాదం కారణంగా క్రిమినల్ కేసులో చిక్కుకుని పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినడానికి కారకులయ్యారు. దీంతో పార్టీ నుంచీ ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆ కేసు న్యాయస్థానంలో రాజీ చేసుకున్నప్పటికీ పార్టీ సస్పెన్షన్ మాత్రం ఇంకా తొలగలేదు. దీంతో ఏడు నెలలకుపైగా నియోజకవర్గంలో పార్టీకి దారీ తెన్నూ లేకుండా పోయింది. నాయకులు, కార్యకర్తలూ పెద్దగా ఎమ్మెల్యే దగ్గరకు వెళ్ళడం లేదు. గత ఎన్నికల సమయంలో పరిశీలకుడిగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఓ వర్గ నేతగా ఎదిగారు. ఆయనకు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పదవి దక్కుతుందని అనుచరవర్గం ఆశిస్తోంది. మాజీ ఎమ్మెల్యే హేమలత అడపాదడపా వచ్చి వెళుతున్నారు. కొద్దోగొప్పో వర్గాన్ని కూడగట్టుకుని ఇంఛార్జి పదవిని ఆశిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి వంద రోజుల తర్వాత చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణకు కో ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబు కూడా ఒక వర్గాన్ని ఏర్పరుచుకుంటున్నారు. వీరిలో చంద్రశేఖర్ నాయుడు పక్షం రోజుల కిందట అభివృద్ధి పనులు ప్రారంభించడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎస్సీ నియోజకవర్గం అని అలుసుగా తీసుకుంటున్నారని, ఇతర నియోజకవర్గాల్లో ఇలా చేయగలరా అంటూ బహిరంగంగానే విమర్శలు చేశారు. ఇలా నేతలు వర్గాలుగా విడిపోవడంతో- నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు పదవుల కోసం, పనుల కోసం ఎవరిని ఆశ్రయించాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. కాగా యువనేత నారా లోకేశ్ నేడు సత్యవేడుకు వచ్చి పార్టీ శ్రేణులతో సమావేశం కానున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. ఎవరో ఒకరికి పార్టీ పగ్గాలు అప్పజెప్పి నియోజకవర్గంలో అభివృద్ధి జరిగేలా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నారు.



చిన్నారితో మొక్కులు





సారె తీసుకొస్తున్న కైకాల వంశీయులు - అమ్మవారి వేషంలో..



మంగళవారం రాత్రి అవిలాల నుంచి సారె ఊరేగింపు

వేషాల జాతర షురూ

● నేడు బైరాగి వేషం

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జాతరకు చాటింపు వేశారని తెలియగానే నగరంలోని యువతతో పాటు చిన్నపిల్లల్లో ఆనందం ఉరకలేస్తుంది. వారం రోజులపాటు వివిధ వేషాలతో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. బుధవారం బైరాగి వేషంతో వేషాల జాతర మొదలవుతుంది. శరీరమంతా నామం కొమ్ము లేదా విభూతి పూసుకుంటారు. రేక్ల కాయల మాలలు మెడలో ధరించి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. వేషంతో ఇంటి దగ్గర బయల్దేరినప్పటి నుంచి బూతులతో జనాలను భయపెట్టడం జాతర ఆచారం. ఇవిగాక పలువురు మహిళలు వేపాకు చీరలు కట్టుకుని, నెత్తిన వేయికళ్ల దుత్తలు పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.



గంగమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

నవ్వుతున్నారు..నాయకా!

జాతర ఉత్సవ కమిటీలపై కూటమిలో కుమ్ములాటలు

ఒకటి కాదు, రెండు కాదు నాలుగు జాబితాలు విడుదల

(తిరుపతి, ఆంధ్రజ్యోతి)

తిరుపతి కూటమి నేతల్లోని అనైక్యతకు తిరుపతి గంగజాతర అద్దం పడుతోంది. అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరవుతున్నా గంగమ్మ గుడికి పాలకమండలిని ప్రకటించలేకపోగా, జాతర నిర్వహణకు ఉద్దేశించిన ఉత్సవ కమిటీని కూడా ఏకాభిప్రాయంతో ఏర్పాటు చేసుకోలేని స్థితిలో ఉన్నారు. మార్పులూ చేర్పులూ, అలకలూ కోపతాపాలతో జాతర చాటింపు మొదలైన మంగళవారం సాయంత్రానికి 23 మందితో కలెక్టర్ సంతకంతో ఒక జంబో కమిటీని ప్రకటించారు. మరోవైపు నాయకుల భేషజాలతో సంబంధం లేకుండా జాతర తంతు మాత్రం సంప్రదాయంగా మొదలైపోయింది. ప్రజలు భక్తితో సున్నపు బొట్లుతో, వేషాలతో, దుత్తలతో వచ్చి గంగమ్మను దర్శించుకుని వెళ్తున్నారు.

దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలకు పాలకమండలి లేకపోతే తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమించి ఉత్సవాలు నిర్వహిస్తారు. గత 20 ఏళ్ల తిరుపతి జాతరలో మూడుసార్లకు పైగా స్థానికాలయాలకు ఇలాగే ఉత్సవ కమిటీలను నియమించారు. ఈ సంప్రదాయం ప్రకారం తిరుపతి గంగమ్మజాతరకు ఉత్సవకమిటీని ఏర్పాటు చేశారు. ఇదే కూటమి నేతల మధ్య అభిప్రాయ భేదాలకు కారణమైంది. కూటమిలోని ఇతర పార్టీల నేతలతో సంప్రదింపుల తర్వాత జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 27 మందితో ఒక జాబితాను తొలుత సిద్ధం చేశారు. ఇందులో సింహభాగం టీడీపీ కార్యకర్తలే ఉన్నారు. దానిని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ద్వారా రాష్ట్ర కమిషనర్‌కు పంపారు. అదేఫైనల్ అనుకుని అందులో పేర్లున్నవారు ఆ జాబితాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకుని శుభాకాంక్షలు అందుకుని సంబరపడ్డారు. ఇంతలో ఏం జరిగిందో ఏమోగాని నాలుగు రోజుల కిందట కలెక్టరేట్ నుంచి డీఆర్వో నరసింహులు పేరుతో 15 మందితో మరో జాబితా విడుదలైంది. ఇందులో తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలతో పాటు వివిధ నామినేటెడ్ పదవులు పొందిన కూటమి నేతలు, మాజీ ఛైర్మన్లు ఉన్నారు. దీనిపై కూటమి పార్టీల కార్యకర్తలు తీవ్రంగా అసంతృప్తి చెందారు. సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నాయకులపైనే ఆగ్రహం వెళ్లగక్కారు. గంగమ్మ గుడిలో పదినిమిషాలు కూడా కూర్చోని వారిని ఉత్సవ కమిటీలో ఎలావేస్తారని ప్రశ్నించారు. ఇదిలావుంటే ఈ జాబితాలతో సంబంధంలేకుండా డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, నందగోపాల్ నాయుడుల పేరుతో డీఆర్వో మరో ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

జాతర తుదికమిటీ సభ్యులు వీరే

గంగజాతర తుది కమిటీలో బాలసుబ్రమణ్యం రెడ్డి, మస్నెం శ్రీనివాసులు, ఆముదాల తులసీరాం,మహేష్ యాదవ్, ఆనంద యాదవ్, ఉమాశంకర్, జలపోతు చంద్రశేఖర్ రెడ్డి, శాంతి కుమారి, అశోక్, దేవరాజులు, నందగోపాల్ నాయుడు, విజయలక్ష్మి, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తమ్మినేని వెంకటేశ్వర్లు, హరిశంకర్, బాబ్జి, సుధాకర్, బుజ్జిబాబు, ఆనంద్, తమ్మిశెట్టి చంద్రశేఖర్, ఎస్వీ నరసింహ యాదవ్, ప్రభాకర్, సోము వేదవతి రాయల్ ఉన్నారు.

కలెక్టర్ సమీక్షతోనూ కొలిక్కిరాలేదు

అసంతృప్తులు, విమర్శల నేపథ్యంలో వివాదానికి తెరవేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ భావించారు. కూటమి ముఖ్యులను కూర్చోబెట్టుకుని సోమవారం కలెక్టరేట్‌లో జాతరపై సమీక్షిస్తూ తుదిజాబితాకోసం పని చేసేవారి పేర్లు ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. అడిగిందే తడవుగా ఎవరికివారు పెద్ద సంఖ్యలోనే పేర్లు ఇచ్చినట్టు తెలిసింది. ఈ సమయంలో ఇద్దరు నేతలు అలిగి వెళ్లిపోయారని సమాచారం. జాతర కమిటీ జాబితా మళ్లీ మొదటికి రావడంతో.. టీటీడీ బోర్డులోనూ ఇంత మంది ఉండరు కదా.. మీరే తేల్చుకుని జాబితా ఇవ్వండని కలెక్టర్ అన్నట్టు తెలిసింది. కమిటీ కోసం జాతర ఆగదు కదా. మంగళవారం మొదలైపోయింది. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు 21 మంది పేర్లతో కలెక్టర్ పేరిట ఓ జాబితా విడుదలైంది. దానికి కూడా సంతృప్తి చెందని కూటమి నేతలు కలెక్టర్‌పై ఒత్తిడి చేసి మరో ఇద్దరి పేర్లను తగిలించుకున్నారు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో 23 మందితో కలెక్టర్ సంతకంతో మరో జాబితా వెలువడింది. ఏడాదికో సారి జరిగే జాతరనే కలిసి నిర్వహించుకోలేని స్థితిలో కూటమి నేతలు ఉంటే భవిష్యత్తు ఎలా ఉండబోతుందా అనే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

జిల్లాలో పలుచోట్ల అకాల వర్షాలు

● కూలిన వృక్షాలు ● విద్యుత్తు తీగలు తెగి సరఫరాకు అంతరాయం

తిరుపతి, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల మంగళవారం సాయంత్రం అకాల వర్షాలు కురిశాయి. 4 గంటల వరకూ ఎండలు, ఉక్కపోతతో జనం సతమతమవగా.. ఆ తర్వాత వాతావరణంలో మార్పు కనిపించింది. వెంకటగిరి, శ్రీకాళహస్తి, ఏర్పేడు, పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, తిరుపతి రూరల్, డక్కిలి, బాలాయపల్లి తదితర మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏర్పేడు మండలంలో గోడకూలి ఇద్దరు మృతిచెందారు. వెంకటగిరి అరగంట పాటు గాలీవానా బీభత్సం సృష్టించింది. వృక్షాలు కూలాయి. దుకాణాలపై రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీకాళహస్తిలో 6.20 నుంచీ 40 నిమిషాల పాటు హోరుగాలులతో పాటు పడిన వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పుత్తూరు పోలీస్ స్టేషన్, గేటు పుత్తూరు, నారాయణవనం రైల్వే గేటు తదితర చోట్ల విద్యుత్ తీగలు తెగిపోయాయి. కేఎం అగ్రహారం వద్ద విద్యుత్ స్తంభంపై రెండు చెట్లు కూలడంతో ఆయా ప్రాంతాల్లో సరఫరా ఆగిపోయింది. తిరుపతి రూరల్ మండలంలో ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గొల్లపల్లిలో సర్పంచ్ రవి కారుపై వేపచెట్టు కూలింది. తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో సైతం గాలులతో కూడిన వర్షం కురిసింది.



వెంకటగిరి పట్టణం రాణీపేట వద్ద ఓ దుకాణంపై తిరగబడిన రేకులు

రెండు చోట్ల గోడకూలి ఇద్దరి మృతి

● ఒకరికి గాయాలు

ఏర్పేడు, మే 6(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో మంగళవారం సాయంత్రం గాలివానకు గోడ కూలి ఇద్దరు మృతిచెందారు. చిందేపల్లి దళితవాడలో క్రికెట్ ఆడుతున్న పెద్దలు, పిల్లలు వర్షానికి తల దాచుకోవడానికి మైదానం సమీపంలోని రేకుల షెడ్‌లోకి వెళ్లారు. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో గోడ కూలగా, సోమిశెట్టి అంజనేయులు(19) అక్కడికక్కడే మృతి చెందగా కోటేశ్వరరావు(27) గాయపడ్డాడు. ఈయన్ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అలాగే, వికృతమాలకు చెందిన ఎల్లప్పరెడ్డి(60) పొలం నుంచి వస్తుండగా ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో కోళ్ల ఫారం వద్దకు వెళ్లారు. అక్కడ గోడ కూలి ఎల్లప్పరెడ్డిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఎల్లప్పరెడ్డి (పాతచిత్రం)





గోడకూలడంతో మృతిచెందిన సోమిశెట్టి ఆంజనేయులు

ఎస్ఎస్ ఏపీసీగా గౌరీశంకర్‌రావు



తిరుపతి(విద్య), మే 6(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష విభాగం అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ జి.గౌరీశంకర్‌రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై పాఠశాల విద్యాశాఖకు బదిలీచేస్తూ ఎస్ఎస్ ఏపీసీగా నియమించారు. ఈ మేరకు మంగళవారం సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు డీఈవో కేవీఎన్ కుమార్ ఇన్‌చార్జిగా నిర్వహిస్తున్నారు. కాగా, శంకర్‌రావు గతంలో వరదయ్యపాళెం ఎమ్మార్వోగా పనిచేశారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు 611 మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాతపరీక్షలకు 611మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. కాగా జిల్లాలో మంగళవారం ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలకు మొత్తం 911మంది అభ్యర్థులకు గాను 611మంది హాజరయ్యారని, 300మంది గైర్హాజరయ్యారని వివరించారు.

కేరళ తరహాలో పర్యాటకాభివృద్ధి

● జిల్లాలో మెండుగా అవకాశాలు ఉన్నాయన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

తిరుపతి(కలెక్టరేట్), మే 6(ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జి కృష్ణబాబు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేరళ తరహాలో మెడికల్, హోటల్, స్పిరిచ్యువల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రాష్ట్రంలో స్థూల జాతీయోత్పత్తిలో జిల్లా 3వ స్థానంలో ఉందని, మొదటి స్థానంలోకి వచ్చేలా అన్ని శాఖల అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో పెట్టుబడులకున్న అవకాశాల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించాలన్నారు. పరిశ్రమలకు అనుగుణంగా అధునాతన నైపుణ్య శిక్షణ మ్యాన్‌పవర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటసాగులో అధునాతన పద్ధతులను పాటించేలా రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

పంటపొలాలపై ఏనుగుల దాడి

పాకాల, మే 6 (ఆంధ్రజ్యోతి): పదిపుట్లబైలు పంచాయతీ గుండ్లగుట్టపల్లె సమీపంలోని పంటపొలాలపై సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. పంటలను ధ్వంసం చేశాయి. రైతు డి.సరోజమ్మకు చెందిన టమోట పంటను తొక్కివేసి తీవ్ర నష్టం కలిగించాయి. మండల ఉద్యాన అధికారి శైలజ నష్టపోయిన పంటలను పరిశీలించారు.



ఏనుగులు ధ్వంసం చేసిన టమోట పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ